క్లుప్తంగా

ఏఐసీసీ అధ్యక్షుడిని కలిసిన జనక్‌ప్రసాద్



ఖర్గేకు వినతిపత్రం ఇస్తున్న జనక్ ప్రసాద్

కొత్తగూడెంరూరల్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను ఢిల్లీలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్ ప్రసాద్ మంగళవారం కలిశారు. రామగుండం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. 2018 ఎన్నికల్లో 12 స్థానాలకు 8 కోల్‌బెల్ట్ ఏరియాలో ఐఎన్‌టీయూసీ ప్రభావం చూపిందని, దీతో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని గుర్తు చేశారు. ఐఎన్‌టీయూసీ ప్లీనరీలో రాహుల్ గాంధీ హామీలను ఖర్గేకు వివరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు రీ షెడ్యూల్ చేయాలి



మాట్లాడుతున్న కాసాని ఐలయ్య

జూలూరుపాడు: రైతు రుణాలను రీ షెడ్యూల్ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య సహకార సంఘం పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పడమట నర్సాపురంలో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలూరుపాడు సహకార సంఘం పరిధిలో నాలుగు వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, ఈ ఏడాది రెన్యూవల్ చేయకపోవడంతో రైతులపై 14 శాతం వడ్డీ భారం పడుతుందన్నారు. రీ షెడ్యూల్ చేయకపోతే రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న సొసైటీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సొసైటీకి రూ 90 లక్షలు నిధులు వస్తే పాలకవర్గంలో గ్రూపులు ఏర్పడి రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో అన్నవరపు సత్యనారాయణ, రెడ్డెబోయిన గోవిందు, వల్లమల్ల చందర్‌రావు, లకావత్ శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రలోభాలకు లోనుకావొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరబాబు

టేకులపల్లి: ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీఓ కోట వీరబాబు, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన అన్నారు. ఈ మేరకు భారత ఎన్నికల కమిషన్ అనుబంధంగా పనిచేసే ఎస్‌వీఈఈపీ ఆధ్వర్యంలో టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పడిన ఎన్నికల సాక్షరత క్లబ్ నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. భారతదేశం ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉందని, ఓటు హక్కు ద్వారా ఉత్తమమైన నాయకులను ఎన్నుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లోను కావద్దన్నారు. ఎన్నికలపై అవగాహన పెంచుకుని మండలంలో అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కళాశాల ఎన్నికల సాక్షరతా క్లబ్ నోడల్ మెంబర్ ముంతాజ్ అలీ విద్యార్థులకు ఓటరు విద్యావ్యాప్తి, ఎన్నికలు, ఓటు హక్కు, ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం, ఓటింగ్ ప్రక్రియ గురించి వివరించారు. కార్యక్రమంలో జయకృష్ణ, జయశ్రీ, కృష్ణమూర్తి, బసవమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ట్రెంచ్ పనుల అడ్డగింత

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామపంచాయతీ కుమ్మరిబస్తీలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రెంచ్ పనులను సర్పంచ్ ధనసరి స్రవంతి, స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. ప్రస్తుతం జేకే ఓసీ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న సింగరేణి యాజమాన్యం కుమ్మరిబస్తీలో నివాసాల మధ్య నుంచి ట్రెంచ్ తీసేందుకు ఉపక్రమించింది. విషయం తెలుసుకున్న సర్పంచ్, స్థానికులు అక్కడకు చేరుకొని ట్రెంచ్ పనులను నిలిపివేసి, అధికారులను నిలదీశారు. జేకే ఓసీ ప్రజాభిప్రాయ సభలో చెప్పిన విషయాలకు భిన్నంగా వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు పనులు నిలిపివేసి వెనుతిరిగారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నెల రోజులుగా కుమ్మరిబస్తీలోని సింగరేణి క్వార్టర్లను ఖాళీ చేయించేందుకు సింగరేణి అధికారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీటీసీ పూనెం సురేందర్, ఉపసర్పంచ్ తాండ్ర నాగరాజు, స్థానికులు బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యం.. అష్టైశ్వర్యం

- అతివలకు భరోసా 'ఆరోగ్య మహిళ' పథకం
- శిబిరం ద్వారా వెలుగులోకి వస్తున్న దీర్ఘకాలిక వ్యాధులు
- ప్రతీ మంగళవారం వైద్యసేవలు



కొమరారం పీహెచ్‌సీకి వైద్యపరీక్షల కోసం వచ్చిన మహిళలు

ఇల్లెందురూరల్: ఆరోగ్యంగా ఉన్న కుటుంబానికి అష్టైశ్వర్యాలు ఉన్నట్లేనన్న నానుడి. కానీ చాలా మంది ఆరోగ్యంపై అశ్రద్ధ చూపుతుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఈ అలవాటు కనిపిస్తుంది. జీవన శైలిలో మార్పులు, మానసిక ఒత్తిళ్లు.. సమయపాలన లేని భోజనం.. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి సమస్యలను గుర్తించిన ప్రభుత్వం తొలి విడతగా ఎంపిక చేసిన పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళా పథకాన్ని ప్రారంభించింది. ఎంపికైన మండలంలోని ఏజెన్సీ పల్లెలకు కేంద్రమైన కొమరారం పీహెచ్‌సీ మెరుగైన సేవలందిస్తూ అతివల ఆరోగ్య రక్షకు భరోసాగా నిలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.

ప్రతీ మంగళవారం ఆస్పత్రి కిటకిట...

ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, బయ్యారం మండలాల ఏజెన్సీ పల్లెలకు కేంద్రంగా కొనసాగుతున్న కొమరారం పీహెచ్‌సీలో సాధారణంగా పేషెంట్ల రద్దీ అధికంగానే ఉంటుంది. కానీ ఆరోగ్య మహిళా పథకానికి ఎంపికైన నాటి నుంచి ప్రతీ మంగళవారం మహిళలతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. తమ క్లస్టర్ల పరిధిలో ఏఎన్ఎంలు మహిళలకు పథకంపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

2,234 మందికి వైద్యపరీక్షలు

ఆరోగ్య మహిళా పథకం కొమరారం పీహెచ్‌సీలో ఈ ఏడాది మార్చి 8న ప్రారంభమైంది. పలు గ్రామాల నుంచి ఇప్పటి వరకు 2,234 మంది వైద్య పరీక్షలకు పేర్లు నమోదు చేయించుకున్నారు. ఇందులో వివిధ వ్యాధులతో బాధపడుతున్న 48 మందిని జిల్లా కేంద్రానికి సిఫారసు చేశారు. వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి ఆస్పత్రిలోనే వైద్యం అందిస్తున్నారు. 735 మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గుర్తించి హైదరాబాద్‌కు సిఫారసు చేశారు. అప్పటి వరకు తనకు క్యాన్సర్ ఉంది అని ఆ మహిళ గుర్తించలేకపోయింది. ఇంతేకాకుండా నోటి క్యాన్సర్ ఒకరు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో 10 మంది, సర్వైకల్ క్యాన్సర్‌తో 25 మంది, థైరాయిడ్‌తో 142 మంది, పీసీఓడీతో ముగ్గురు, అధిక బరువుతో 54 మంది బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదిలా ఉండగా ఆస్పత్రికి వచ్చిన వారిలో సగం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించడం ఆందోళన కలిగించే అంశం.

ఉచితంగా ఎనిమిది రకాల పరీక్షలు..

పీహెచ్‌సీలో ప్రతి మంగళవారం మహిళలకు ఎనిమిది రకాల వైద్యపరీక్షలను ఉచితంగా అందిస్తున్నారు. సాధారణంగా అందించే వైద్య సహాయానికి వీటిని అదనంగా చేర్చారు. రక్తనమూనాలను సేకరించి జిల్లా కేంద్రంలోని డయాగ్నస్టిక్ కేంద్రానికి పంపుతున్నారు. ఎవరికైనా వ్యాధి తీవ్రంగా ఉంటే వెంటనే జిల్లా ఆస్పత్రికి సిఫారసు చేస్తున్నారు.

ఆరోగ్యంపై భరోసా కలిగింది



పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగించే తమకు అనారోగ్యం పెద్ద సమస్య. ప్రభుత్వాస్పత్రికి వెళ్లినా తగ్గదన్న భయంతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి బోలెడు డబ్బులు ఖర్చు చేసేవాళ్లం. ఇప్పుడు ప్రతి మంగళవారం ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసహాయం మా ఆరోగ్యంపై భరోసా కలిగిస్తోంది. – సపావత్ సుశీల, పోచారంతండా

సౌకర్యాలు మెరుగుపర్చాలి



ఆరోగ్య మహిళా పథకంతో ఆస్పత్రిలో వివిధ సేవలు ఉన్నా.. పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులో లేవు. ప్రతి మంగళవారం వంద మంది వస్తున్నారు. వీరంతా కూర్చునేందుకు కనీసం స్థలం సరిపోవడం లేదు. అదనపు గదులు నిర్మిస్తే గర్భిణులు, బాలింతలు కూర్చునేందుకు వీలుగా ఉంటుంది. – పూనెం స్వప్న, కొమ్ముగూడెం

సద్వినియోగం చేసుకోండి



ఆరోగ్య మహిళా కేంద్రానికి వచ్చే వారిలో ఎక్కువగా రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి పోషకాహార లోపమే ప్రధాన కారణం. గుడ్లు, మాంసం, ఆకుకూరలు, పాలు ఆహారంలో తీసుకోవాలి. పరీక్షించిన మహిళల్లో అవసరమైన వారిని జిల్లా కేంద్రానికి సిఫారసు చేస్తున్నాం. – డాక్టర్ లోహిత, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, కొమరారం

ప్రభుత్వ తీరు బాధాకరం



కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెంరూరల్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను తక్షణమే పర్మనెంట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వీరిని పర్మనెంట్ చేసే వరకు మినిమం టైమ్ స్కేల్ ఇంప్లిమెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

టేకులపల్లి: రాష్ట్రంలో విద్యా శాఖలోని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లో 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 రోజుల నుంచి నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం తగదని, వెంటనే పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. స్కూల్ కాంప్లెక్స్‌లో, ఎంఈఓ కార్యాలయాలలో సీఆర్పీలుగా, ఎంఐఎస్ కోఆర్డినేటర్లుగా, సీసీఓలుగా, మెసెంజర్లుగా చాలీచాలని జీతాలతో సేవలు అందిస్తూ వారి జీవితాలను త్యాగం చేస్తున్నారని, అటువంటి వారి సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారిని రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.వీరన్న, బి.కస్నానాయక్, టి.హరిలాల్, జి.బీమ్లా, డి.కృష్ణ, కవిత పాల్గొన్నారు.

దళిత బంధుకు మేము అర్హులం కాదా..?



బోడు గ్రామంలో గోడు వెళ్లబోసుకుంటున్న దళితులు

టేకులపల్లి: మేమంతా రెక్కలు ముక్కలు చేసుకుని బతికేటోళ్లం. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు మావి. మేము దళిత బంధుకు అర్హులం కాదా..? ప్రభుత్వం సంక్షేమ పథకానికి మేము నోచుకోమా.. అంటూ బోడు గ్రామానికి చెందిన బాధిత దళిత కుటుంబ సభ్యులు కాళ్ల రంజిత్, మహేష్, ధనుష్, సీతయ్య, అశోక్, వినోద, అన్నపూర్ణ, పార్వతి, కోటేశ్వరి, మంగమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. బోడులో 28, లాక్యా తండాలో 3 మొత్తం 31 దళిత కుటుంబాలు ఉన్నాయన్నారు. దళిత బంధు ద్వారా జీవనోపాధి పొందేందుకు దళిత బంధు పథకం కోసం ఇల్లెందులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నామని తెలిపారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పథకానికి నోచులేదని, ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు అందరికీ మా ఆర్థిక స్థితిగతులు బాగా తెలుసని అయినా ఎంపిక చేయలేదని లబోదిబోమన్నారు. ఎంపిక జాబితాలో తమ పేర్లు ఉన్నప్పటికీ తొలగించి వేరే పేర్లు పెట్టినట్లు తెలిసిందని, ఎలాంటి విచారణ, సర్వే లేకుండా లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఒక్కసారి మా ఇళ్లకు వచ్చి చూస్తే మా బతుకులు అర్థం అవుతాయని కన్నీటి పర్యంతమయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కొందరు నాయకుల వల్ల తమకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఉన్నతాధికారులు, ఇల్లెందు ఎమ్మెల్యే స్పందించి తమకు న్యాయం చేయాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి వారి స్థితిగతులు పరిశీలించి దళిత బంధు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సమ్మెను మరింత ఉధృతం చేస్తాం..

అంగన్‌వాడీలు సమ్మె విరమించి రావాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని, తాళాలు పగులకొట్టి కేంద్రాలను ప్రారంభిస్తామని అధికారులు బెదిరిస్తున్నారని, బెదిరిస్తే మరింత ఉధృతంగా సమ్మె చేస్తామని సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. మంగళవారం రెండో రోజు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: సుజాతనగర్‌లో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ఇల్లెందురూరల్: ప్రదర్శన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



జూలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లు

'మాఫీ' రైతులకు కొత్తగా రుణాలు



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: సొసైటీ ద్వారా రూ.లక్ష లోపు రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వనున్నట్లు డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక సహకార సంఘ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. సొసైటీలో 244 మంది రైతులకు రూ.77లక్షల రుణమాఫీ అయిందని, వీరికి తిరిగి రుణాలు అందజేయడం జరుగుతందన్నారు. కార్యక్రమంలో కాంపెల్లి కనకేశ్, రామ్మోహన్‌రావు, నారాయణరావు, పాపారావు, సీతారాంబాబు, కిషన్, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'మేర' కమిటీ ఎన్నిక



సత్యనారాయణరావు, అధ్యక్షుడు



రేఖల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి

పాల్వంచ: మండల మేర కుల మండల అధ్యక్షుడిగా కీర్తి సత్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా రేఖల ప్రభాకర్, కోశాధికారిగా శనిగారపు రాజేశ్యామ్, ఉపాధ్యక్షుడిగా మాడిశెట్టి మనోహర్‌లను ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక అయ్యప్పనగర్‌లో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు యూనిఫాం కుట్టు పనిని మేర కులస్తులకు మాత్రమే ఇవ్వాలని, బీసీ రుణాల్లో ప్రాధాన్యం కల్పించాలని, ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యాక్రమంలో సింగు రాంబాబు, ఎద్దు వెంకటేశ్వర్లు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న గుమ్మడి అనురాధ

ఇల్లెందురూరల్: మండలంలోని విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ యజమాని సాయిలు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం లా కళాశాల అధ్యాపకురాలు గుమ్మడి అనురాధ మంగళవారం సాయిలు కుటుంబాన్ని పరామర్శించారు. పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు.

ఆరోగ్య మహిళా సేవలు ప్రారంభం



పాల్వంచ: మాట్లాడుతున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



జూలూరుపాడు: ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాములు నాయక్

పాల్వంచ: ప్రభుత్వం ప్రజలకు అనేక వైద్యసదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు బస్తీ దావాఖానాలో ఆరోగ్య మహిళా సెంటర్‌ను వనమా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, డాక్టర్ మణికంఠరెడ్డి, బాలాజీ నాయక్, పెద్దమ్మగుడి చైర్మన్ మహిపతి రామలింగం, మంతపురి రాజుగౌడ్, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, కాల్వ ప్రకాశ్‌రావు, దాసరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఆరోగ్య మహిళ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో ఆరోగ్య మహిళా క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రతి మంగళవారం మహిళలకు ఎనిమిది రకాల వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. నిరుపేద ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, వైస్ ఎంపీపీ గాదె నిర్మల, జూలూరుపాడు సర్పంచ్ గుండెపిన్ని విజయ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్లు రాకేష్ కుమార్, తేజశ్విని, ప్రదీప్తి, యునాని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం



ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ డీవీ, డాక్టర్లు



ఇల్లెందురూరల్: కొమ్ముగూడెంలో ప్రారంభిస్తున్న సర్పంచ్ రామయ్య

ఇల్లెందు: మహిళల ఆరోగ్యం ఇంటికి సౌభాగ్యం.. అన్న నానుడిని నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేక ఆరోగ్య పథకాన్ని రూపొందించిందని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఇల్లెందు ఎల్‌బీఎస్ నగర్‌లోని బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ పథకాన్ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో తెలంగాణలో మహిళలందరీ ఆరోగ్యం పట్ల జాగ్రత తీసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి అందుకు తగిన పరీక్షలు, చికిత్సలు అందించే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్యపరీక్షలకు అవసరమైన అన్ని రకాల పరికరాలు సమకూర్చారని పేర్కొన్నారు. అన్ని వయస్సులలో ఉన్న మహిళలకు ఎనిమిది రకాల పరీక్షలు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు మురళీకృష్ణ, మానస, డీపీఎంఓ గన్యా, సీహెచ్ఓ స్వర్ణలత, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, బస్తీ దవాఖానా సిబ్బంది పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన ఆరోగ్య మహిళ పథకం పేదల కుటుంబాలకు వరం లాంటిదని కొమ్ముగూడెం సర్పంచ్ సూర్నపాక రామయ్య అన్నారు. మండలంలోని రొంపేడు పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా పథకాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు మాత్రమే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. సాధారణంగా చేసే పరీక్షలతోపాటు ఎనిమిది రకాలైన ప్రత్యేక వైద్యపరీక్షలు చేపడతారని పేర్కొన్నారు. మహిళలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఎంపీటీసీ ధనసరి శాంత, వైద్యాధికారిణి డాక్టర్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి అధికారిపై కేసు నమోదు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాకు చెందిన ఓ అధికారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు.. సోమవారం ఇల్లెందులో బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా సింగరేణి బైపాస్ రోడ్డు నుంచి పట్టణంలోకి కాన్వాయ్ వస్తోంది. అదే సమయంలో జేకే ఓసీ నుంచి 21 ఇంక్లైన్‌లోకి సింగరేణికి చెందిన ఓ షావెల్ వాహనాన్ని తరలిస్తున్నారు. మహబూబాబాద్ బైపాస్ రోడ్ క్రాస్ చేసే సమయంలో అక్కడ డ్యూటీలో ఉన్న ఎస్ఐ గిరిధర్‌రెడ్డి (కాచనపల్లి) దానిని నిలిపి వేశాడు. ఈ సమాచారం షావెల్ ఆపరేటర్ శ్రీను ఎన్విరాన్‌మెంట్ అధికారి ధనుంజయ్‌రెడ్డికి చేరవేశారు. అక్కడికి చేరుకున్న ధనుంజయ్‌రెడ్డికి ఎస్ఐ గిరిధర్‌రెడ్డితో వివాద జరిగింది. సమాచారం అందుకున్న డీఎస్పీ రమణమూర్తి అక్కడి చేరుకోగా వారి పట్ల కూడా దురుసుగా ప్రవర్తించటంతో ఎస్ఐ గిరిధర్‌రెడ్డి పిర్యాదు మేరకు ధనుంజయ్‌రెడ్డితో పాటు ఆపరేటర్ శ్రీను మీద కేసు నమోదు చేశారు. ఈ విషయమై డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లగా జీఎం జాన్‌ఆనంద్ ఆదేశాల మేరకు సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డిని పరిశీలించి నివేదిక అందజేయమని ఆదేశించినట్లు తెలిపారు. పోలీసులతో సత్ సంబంధాలు ఉంటాయని, చిన్న తేడాలు ఉంటే సవరించుకోవటం జరుగుతుందన్నారు.

గణేష్ ఉత్సవాలకు హాజరుకండి



ఆహ్వానపత్రం అందజేస్తున్న ఈఓ సులోచన

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధిలోని శ్రీ విజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం (గణేష్ టెంపుల్)లో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రుల మహోత్సవాలకు హాజరుకావాలని, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు, ఎస్పీ డాక్టర్ వినీత్, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌కు ఆలయ ఈఓ కె.సులోచన మంగళవారం స్వయంగా ఆహ్వాన పత్రాలు అందజేశారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ పి.రాంబాబు, ఎంవీఐ అధికారి వి.రవీంద్రనాథ్, త్రీటౌన్ సీఐ మురళీలకు ఆహ్వానపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానం



ప్రమాదకరంగా ఉన్న తడికలపూడి-కారేపల్లి రోడ్డు

టేకులపల్లి: టేకులపల్లి మండలం తడికలపూడి నుంచి కారేపల్లి మండలం చీమలపాడు వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. మండలవాసులు ఇల్లెందు మీదుగా ఖమ్మం వెళ్లాలంటే దూరాభారం, హెవీ ట్రాఫిక్ ఉంటుంది. అదే తడికలపూడి నుంచి చీమలపాడు మీదుగా తిమ్మారావుపేట వయా ముచ్చర్ల క్రాస్‌రోడ్ నుంచి ఖమ్మం వెళితే దూరాభారం తగ్గడంతో పాటు ట్రాఫిక్ లేకుండా వెళ్లవచ్చు. వివిధ అవసరాల నిమిత్తం వ్యాపారులు, ప్రజలతో పాటు ఉద్యోగులు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారు. తడికలపూడి నుంచి చీమలపాడు వరకు మొత్తం 7 కిలోమీటర్లు అడుగడుగునా గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. దీంతో అదుపు తప్పి కిందపడటం, గాయాలపాలు కావడం, రాత్రి సమయంలో మరింత ప్రమాదకరంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. పాలకులు స్పందించి ఈ రహదారికి నిధులు కేటాయించి తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఈ రోడ్డుకు రెండేళ్ల క్రితమే ఆర్అండ్‌బీ అధికారులు రూ.3 కోట్ల అంచనాతో బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రతి పాదనలు కూడా పంపారు.

భయం భయంగా రావాల్సి వస్తోంది



నేను తిమ్మారావుపేట నుంచి ప్రతిరోజూ తడికలపూడికి పనిమీద వస్తుంటాను. గుంతలు, కంకర తేలి ఉండటంతో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటోంది. నేను చూస్తుండగానే చాలామంది అదుపు తప్పి బైక్‌పై నుంచి కిందపడ్డారు. ప్రభుత్వం స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలి. – కొండలరావు, ప్రయాణికుడు

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



తడికలపూడి నుంచి చీమలపాడు వరకు బీటీ రోడ్డుకు సంబంధించి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. రోడ్డు అప్రూవ్ అయింది. నిధులు కూడా మంజూరయ్యాయి. టెండర్ కూడా పూర్తి అయింది. త్వరలోనే రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించడం జరుగుతుంది. – వి.వెంకటేశ్వరరావు, ఆర్అండ్‌బీ డీఈ, ఇల్లెందు